# గ్యారెంటీ లేనోళ్లు వస్తున్నరు జాగ్రత్త


ప్రచారానికి హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్

- కాంగ్రెసోళ్ల మాటలు నమ్మద్దు
- ఆ పార్టీ వస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరైతది
- పార్టీ మారినోళ్లు రాజీనామా చేయాలి
- మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి
- మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్

మానకొండూర్ రూరల్, నవంబర్ 17: 'గ్యారెంటీ లేని కాంగ్రెసోళ్లు వస్తున్నరు. వారితో జాగ్రత్తగా ఉండాలి. వారి మాటలు నమ్మద్దు. ఆ పార్టీకి పగ్గాలు ఇస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరైతది' అని మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, తనను మూడోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని రసమయి బాలకిషన్ ప్రజలను కోరారు. మానకొండూర్ మండలంలోని పచ్చునూర్, మద్దికుంట, కెల్లేడు, పోచంపల్లి, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్, వన్నారం గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో కలిసి రసమయి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పచ్చునూర్‌లో బీఆర్‌ఎస్ పేరుతో గెలిచి, వేరే పార్టీలోకి వెళ్లారని, అలాంటి వారు పదవులకు రాజీనామా చేయాలని సూచించారు. కానీ వారు రాజీనామా చేయకుండా ఉద్యమం చేసిన జీవీ రామకృష్ణారావు కుటుంబాన్ని, బీఆర్‌ఎస్‌ను విమర్శించడం తగదన్నారు. దొంగ సర్టిఫికేట్లతో పదవులను చేపట్టిన వారు సైతం ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అరవై ఏండ్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయలేదని, కానీ ఇప్పుడు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం జలాలతో చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్, వన్నారం గ్రామాలకు సాగు, తాగు నీరు అందించామని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో మీ ఊళ్లోకి వస్తున్న కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఆగం కావద్దని విజ్ఞప్తి చేశారు. జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి రసమయి బాలకిషన్ అన్నారు. మరోసారి రసమయి బాలకిషన్‌ను ఆశీర్వదించి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 20న సీఎం కేసీఆర్ సభ ఉందని, ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే, జీవీఆర్ బీఆర్‌ఎస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రతి గ్రామంలో డప్పు చప్పుళ్లతో, మహిళలు కోలాటలు, మంగళహారతులు, బతుకమ్మలు, బోనాలతో ఎమ్మెల్యే రసమయికి ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, మానకొండూర్ సొసైటీ అధ్యక్షుడు నల్ల గోవిందరెడ్డి, ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

## చేయి గుర్తుకు ఓటేస్తే టార్చ్‌లైట్ కొనుక్కోవాల్సిందే

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

మానకొండూర్ రూరల్, నవంబర్ 17: ఎన్నికల్లో చేయి గుర్తుకు ఓటేస్తే తెలంగాణ అంధకారమవుతుందని, ప్రజలు, రైతులు టార్చ్‌లైట్ కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లిలో శుక్రవారం రాత్రి బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాకముందు 700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, నేడు 26 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి 24 గంటలు కరెంటును అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఒక్క ఎస్సారెస్పీ కడితే, తెలంగాణ వచ్చినంక ఐదు ఎత్తిపోతల పథకాలను కట్టామన్నారు. ఎత్తిపోతల పథకాల ఫలితాలతో తెలంగాణ సస్యశ్యామలమైందన్నారు. గులాబీ రంగు ప్రేమకు చిహ్నమని, బీఆర్‌ఎస్ సర్కారు తెలంగాణలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటేసి ఆగం కావద్దని ప్రజలకు సూచించారు. కారు గుర్తుపై ఓటు వేసి, బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవ సతీశ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- పలు క్రిటికల్ పోలింగ్ కేంద్రాల సందర్శన

ముస్తాబాద్, నవంబర్ 17: ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లాలో పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. శుక్రవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు గూడెం, నామాపూర్, ముస్తాబాద్, పోతుగల్, బంధనకల్ ను సందర్శించి కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ... జిల్లాలో క్రిటికల్ గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా తగిన బందోబస్తు చర్యలను తీసుకోనున్నట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ ఎటువంటి గొడవలు లేకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించేలా చూడాలన్నారు. ఈ ప్రాంతాల్లో వీలైనంత ఎక్కువగా ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహన తనిఖీలు నిర్వహించి ఓటర్ల కు భద్రత కల్పించాలని చెప్పారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉం డాలని సూచించారు. అనంతరం సిద్దిపేట, సిరిసిల్ల జిల్లా సరిహద్దు ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకట్రావుపల్లె ప్రధాన రహదారి వద్ద ఏర్పా టు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేశారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని ఆదేశించారు. ఇక్కడ డీఎస్పీ ఉదయ్ రెడ్డి, ఎస్ఐ శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు

## నిబంధనల మేరకు హోమ్ ఓటింగ్ చేపట్టాలి

కలెక్టరేట్, నవంబర్ 17: పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌ను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌పై కలెక్టరేట్‌లో అధికారులకు ఓరియెంటేషన్ ట్రైనింగ్ నిర్వహించగా కలెక్టర్ పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌పై అధికారులకు సూచనలు చేశారు. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతంపై వైకల్యమున్న అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని కల్పించిందన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్దేశిత బృందాలు హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి నిబంధనల మేరకు ఓటింగ్ హక్కుకు అవకాశం కల్పిస్తాయని చెప్పారు. ఒక్కో బృందంలో పీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్, పోలీసు సిబ్బంది వీడియోగ్రాఫర్ ఉంటారని చెప్పారు. పోలింగ్ సిబ్బందికి కేటాయించిన అధికారిక వాహనంలో మాత్రమే సిబ్బంది వెళ్లి హోమ్ ఓటింగ్ విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉండి ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో గీతానగర్‌లోని జడ్పీహెచ్‌ఎస్, వేములవాడ నియోజకవర్గంలో అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 వరకు హోమ్ ఓటింగ్ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బందికి ఈ నెల 21, 22, 25 తేదీలో జరిగే ట్రైనింగ్ వేదికల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సర్వీసుల సిబ్బందికి ఈ నెల 25న రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఓటింగ్‌కు అవకాశం కల్పించామన్నారు.

### శిక్షణ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కోసం ఉద్దేశించిన కేంద్రాలను కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. సిరిసిల్ల నియోజకవర్గానికి సంబంధించి సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

## కెప్టెన్‌కు శుభాకాంక్షల వెల్లువ


కెప్టెన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 17: మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు జన్మదినం సందర్భంగా మండలంలోని సింగాపూర్ గెస్ట్‌హౌస్‌లో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కెప్టెన్‌ను కలిసిన వారిలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు కొలిపాక శ్రీనివాస్, రవీందర్‌రావు తదితరులు ఉన్నారు.

## కౌశిక్‌రెడ్డి గెలుపు కోసం ప్రత్యేక పూజలు


నాగేంద్రస్వామి ఆలయంలో పూజల అనంతరం శాలిని, నాయకురాళ్లు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్17: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ఈ ఎన్నికల్లో గెలవాలని ఆయన సతీమణి శాలిని హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గల శ్రీ నాగేంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం నాగుల చవితిని పురస్కరించుకొని ఆమె నాగేంద్రస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ పూజారి పందిళ్ల భాస్కర్‌శర్మ ఆమెతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర నాయకురాలు గోడిశాల పావనిగౌడ్, స్థానిక కౌన్సిలర్ బాశబోయిన వనితకుమార్, పలువురు మహిళా నాయకురాళ్లు ఉన్నారు.

## ఎల్లమ్మ ఆలయానికి భూమిపూజ

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 17: మండలంలోని జూపాక గ్రామంలో శుక్రవారం ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి గౌడ కులస్తులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టూరిజం డెవలమెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ హాజరై కొబ్బరి కాయ కొట్టారు. ఆయన వెంట నాయకులు బండ శ్రీనివాస్, రవీందర్‌రావు, ఇమ్రాన్‌తో పాటు గౌడ కులస్తులు తదితరులు ఉన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన చంద్రగిరి ఉపసర్పంచ్

వేములవాడ రూరల్, నవంబర్ 17 : వేములవాడ మండలం చంద్రగిరి ఉపసర్పంచ్ పెండ్యాల అశోక్ కాంగ్రెస్ పార్టీని బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎంపీపీ బూర వజ్రమ్మబాబు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ అశోక్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షతులమై పార్టీలో చేరామని వెల్లడించారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో చల్మెడ గెలుపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చల్మెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం శుభసూచకమని, కారు గుర్తు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆర్సీ రావు, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, సర్పంచ్ రాసూరి రాజేశం, భాస్కర్, శ్రీనివాస్, తదితరులు పాలొన్నారు.

## కాంగ్రెస్‌ను వీడి.. బీఆర్‌ఎస్‌లో చేరి..

కోనరావుపేట, నవంబర్ 17: నిజామాబాద్ పరిధిలోని చాంద్‌నగర్‌కు చెందిన 20మంది యువకులు యూత్ అధ్యక్షులు సయ్యద్ చాంద్, సయ్యే ద్ మస్తాన్ అధ్వర్యంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరారు. వేములవాడ పట్టణంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం అహర్నిషలు కృషి చేస్తామని వారు వెల్లడించారు. ఇక్కడ బడేమియా, యాకుబ్, సాబీర్ హుస్సేన్, షేక్ ఇమామ్ తదితరులు ఉన్నారు.

## జిల్లెల్ల చెక్‌పోస్ట్‌లో రూ.1.12లక్షలు పట్టివేత

సిరిసిల్ల రూరల్, నవంబర్ 17: జిల్లా సరిహద్దులోని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని చెక్‌పోస్ట్‌లో వాహన తనిఖీల్లో నగదును ఎన్నికల అధికారులు పట్టుకున్నారు. గురువారం అర్ధరాత్రి వాహన తనిఖీల్లో నాలుగు వాహనాల్లో రూ. 1.12 లక్షల నగదు పట్టుకుని, ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారులు, పోలీసులు తెలిపారు.

## గ్రామాల్లో పోలీసుల కవాతు

సిరిసిల్ల రూరల్, నవంబర్ 17: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి, రామన్నపల్లె, బస్వాపూర్, బాలమల్లుపల్లె, నర్సింహులపల్లె, చిన్నలింగాపూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు కోరారు. ఎవరైనా మద్యం, నగదు పంచితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.